
ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY
5



సరిహద్దులో.. ఇసుక పంచాయితీ

- తుంగభద్రలో మొన్నటి వరకు సరిహద్దుదాటి ఇసుక తరలించిన ఏపీ
- సుంకేసుల వద్ద బ్యాక్‌వాటర్ నిండుగా ఉన్నా డ్రెడ్జింగ్ పద్ధతిన తవ్వకం
- ఆ సమయంలో తెలంగాణ మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల ప్రేక్షక పాత్ర
- తాజాగా ఇక్కడి ట్రాక్టర్లు ఏపీ పరిధిలోకి వచ్చాయంటూ జరిమానాలు
- గతంలో ఆంధ్రప్రదేశ్ ఇసుక కాంట్రాక్టర్లతో స్థానిక నాయకులు, అధికారుల కుమ్మక్కు



తెలంగాణ ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని, జరిమానా విధిస్తున్న ఏపీ అధికారులు(ఫైల్)

మహబూబ్‌నగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య ఇసుక పంచాయితీ నెలకొంది. తెలంగాణకు చెందిన కొందరు ట్రాక్టర్ల యజమానులు ఏపీ పరిధిలో ఉన్న భూభాగంలో ఇసుక తవ్వకాలు చేపట్టడంతో ఈ వివాదం తలెత్తింది. తెలంగాణలోని జోగుళాంబ గద్వాల, ఏపీలోని కర్నూలు జిల్లాల మధ్య తుంగభద్ర నది ప్రవహిస్తోంది. రాష్ట్ర విభజనకు ముందు ఇక్కడ సరిహద్దులు లేవు. అయితే రాష్ట్ర విభజన జరిగిన కొన్నాళ్ల తర్వాత ఇసుక తవ్వకాల విషయంలో ఇరు రాష్ట్రాల వ్యాపారులకు వాగ్వాదాలు జరుగుతుండటంతో సరిహద్దులను నిర్ణయించారు. ఏపీ వైపు అటువైపు సగం.. తెలంగాణవైపు సగం ఉండేలా బార్డర్ నిర్ణయించారు. ఆ తర్వాత నుంచి ఏపీ అటువైపు ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇచ్చింది. ఇటువైపు తెలంగాణ ప్రభుత్వం కూడా ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇచ్చింది. దాదాపు నాలుగేళ్లుగా సుంకేశుల వద్ద బ్యాక్ వాటర్ ఏడాది పొడవునా ఉంటుండటంతో తెలంగాణ ఇసుక తవ్వకాలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. గతంలో ఇక్కడ ఇసుక రీచ్‌కు అనుమతి ఇచ్చినప్పటికీ.. ఇచ్చిన క్యూబిక్ మీటర్లలో పావు వంతు కూడా తవ్వుకోలేని పరిస్థితి ఏర్పడింది. మళ్లీ తవ్వుకునేందుకు కాంట్రాక్టర్ అనుమతి కోరినా.. స్థానిక నాయకుల వల్ల దాన్ని రద్దు చేసుకున్నారు. ఇసుక తవ్వకాలకు అవకాశం ఉన్న సమయంలో రాజకీయ కారణాలతో అడ్డుపడటంతో ఇక్కడి వ్యాపారులు కాళేశ్వరం, ఏటూరు నాగారం వద్ద నుంచి ఇసుకను లారీల్లో తెచ్చుకుని వ్యాపారం చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లా పరిధిలో కృష్ణానది ప్రవహిస్తున్నా.. అక్కడ ఇసుక లభ్యం కాదు. పై భూభాగమంతా నల్లరేగడి నేలలు కావడంతో ఇసుక రాదు. కేవలం ఒండ్రు మాత్రమే వస్తుంది. తుంగభద్ర నది పరివాహకంలో ఎర్ర నేలలు ఉండటంతో వరద వచ్చినప్పుడు ఏటా ఇసుక మేటలు ఏర్పడతాయి. రీచ్‌లకు అనుమతులు ఇచ్చినా.. సరిగా ఇసుక తవ్వకాలు చేపట్టలేని పరిస్థితి జోగుళాంబ గద్వాల జిల్లాలో ఉందని చెప్పొచ్చు.

వారు తరలించినప్పుడు ప్రేక్షక పాత్ర..

తాజాగా తమ భూభాగం నుంచి ఇసుకను తెలంగాణ ఇసుకాసురులు అక్రమంగా తరలిస్తున్నారని ఏపీకి చెందిన అధికారులు సుమారు 64 ట్రాక్టర్లను సీజ్ చేశారు. అవి కూడా జోగుళాంబ గద్వాల జిల్లాలో అధికారికంగా మన ఇసుక- మన వాహనం కింద ఏర్పాటు చేసిన ట్రాక్టర్లే. అయితే ఆ భూభాగంలో ఇసుకను తవ్వుతుండగా ఏపీ అధికారులు తీసుకున్న చర్యలు సరైనవేనని చెప్పొచ్చు. అదే సమయంలో ఇక్కడి అధికారుల చర్యలను మాత్రం చాలామంది తప్పుపడుతున్నారు. ఏడాది పొడవునా సుంకేసులలో దాదాపు నాలుగేళ్లుగా నీరు నిలిచి ఉంటోంది. ఈ కారణంగా ఇసుక రీచ్‌కు అనుమతి ఉన్నా.. తవ్వుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. కానీ ఏపీ మైనింగ్ అధికారులు మాత్రం ఏడాది పొడవునా నది నుంచి ఇసుకను తరలిస్తూనే ఉన్నారు. దీనికి కారణం వారు డ్రెడ్జింగ్ పద్ధతిని వినియోగించడమే. సముద్రాల్లో వినియోగించే ఈ సాంకేతిక పద్ధతిని ఏపీ.. చాలా ఏళ్లుగా తుంగభద్ర వద్ద వినియోగించి ఇసుకను తరలిస్తోంది. డంపింగ్ చేసుకుని.. కాసులు కూడబెట్టుకుంటోంది. కానీ తెలంగాణలోని పాలకులకు కానీ.. అధికారులకు కానీ ఆ విషయంలో సోయి లేదని చెప్పొచ్చు. మైనింగ్ శాఖ ఆధ్వర్యంలో రెండు డ్రిజ్జింగ్ మిషన్లను తెచ్చి బోట్ల ద్వారా ఇసుకను తరలించలేకపోతున్నారు. పలుమార్లు ప్రతిపాదనలు పంపినప్పటికీ.. అమలుకు నోచుకోలేదు. దీనికారణంగా దాదాపు నాలుగేళ్లుగా నీళ్లు ఉన్న సమయంలోనూ ఏపీ ఇసుక కాంట్రాక్టర్లు.. ఇసుక తవ్వకాలు ఇబ్బడిముబ్బడిగా చేపట్టారు. నీటిలో హద్దులు సరిగా తెలియకపోవడంతో తెలంగాణవైపు కూడా ఇసుక తవ్వకాలు చేశారు. ఆ సమయంలో తెలంగాణలోని ఇరిగేషన్, మైనింగ్ శాఖ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం తప్ప.. పట్టించుకున్న దాఖలాలు లేవు.

డ్రెడ్జింగ్ ఉంటే మేలు..

ఏటా తుంగభద్రకు వరద భారీగానే వస్తోంది. వరదతోపాటే ఈ ప్రాంతంలో ఇసుక మేటలు ఏర్పడుతాయి. నది నుంచి ఇసుక తీయడానికి ఏపీ డ్రెడ్జింగ్ సాంకేతికతను వినియోగిస్తుండగా.. తెలంగాణవైపు నుంచి ఆ దిశగా ఆలోచనలు లేవు. దీన్ని ఆసరాగా చేసుకున్న స్థానిక నాయకులు కొందరు ఏపీ ఇసుక కాంట్రాక్టర్లతో గతంలో కుమ్మక్కయ్యారు. ఇసుక తెలంగాణ హద్దులో తోడుతున్నారని గ్రామస్థులు చెప్పినా అప్పట్లో ఎవరూ పట్టించుకోలేదు. అలాగే నీరు లేని ప్రాంతాల్లో కొందరు ఇసుకాసురులు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతూ ఇసుకను తరలించారు. ఇందుకు రాజకీయ నాయకుల అండ ఉండటంతో దందా సాగింది. ఫలితంగా మన ఇసుక- మన వాహనం కింద ఇసుక తరలింపునకు, ఇసుక రీచ్‌లో తవ్వకాలకు ఆటంకాలు కూడా ఏర్పడ్డాయి. ఒక దశలో ఏపీ అడ్డగోలు ఇసుక తవ్వకాలతో నదిలో ఒకవైపు పల్లం ఏర్పడటంతో.. సుంకేసుల బ్యాక్‌వాటర్ ఆధారంగా నిర్మించిన తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి నీరు అందలేదు. నదిలో నీరు కనిపించినప్పటికీ.. అప్రోచ్ కెనాల్ ద్వారా పంపుహౌజ్‌లోకి వెళ్లలేదు. ఈ కారణంగా అప్పట్లో నది ఉధృతంగా ఉన్నప్పుడు పంప్‌హౌజ్‌పై ఒత్తిడి పెరగకుండా వేసిన అడ్డుకట్టను కూడా కొంత మేర తొలగించి.. ఆయకట్టుకు నీరివ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ మైనింగ్ శాఖ కూడా ఈ డ్రెడ్జింగ్ పద్ధతిలో ఇసుక తవ్వకాలను చేపడితే.. నది సమాంతరంగా ఉండి.. తుమ్మిళ్ల ఆయకట్టుకు నీరందించడంతోపాటు ఇసుక తవ్వకాలను కూడా చేపట్టవచ్చు.



తుంగభద్ర నదిలో డ్రెడ్జింగ్ పద్ధతిన ఇసుక తవ్వకాలు చేపడుతున్న ఏపీ(ఫైల్)

నీట్ మళ్లీ నిర్వహించాలి

- పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి
- ఎన్‌టీఏను రద్దు చేయాలి
- విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పాలమూరులో స్టూడెంట్ మార్చ్
- వేలాదిగా పాల్గొన్న విద్యార్థులు



తెలంగాణ చౌరస్తాలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూన్ 22: నీట్‌ను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, పేపర్ లీకేజీపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ, ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ సంఘాల ఆధ్వర్యంలో వందలాది మంది విద్యార్థులు స్టూడెంట్ మార్చ్ చేపట్టారు. వారి నినాదాలతో ప్రధాన వీధులు మారుమోగాయి. అనంతరం తెలంగాణ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల జిల్లా నాయకులు ప్రశాంత్, భరత్‌అవేస్, రమేష్, లక్ష్మణ్, రాజు, సీతారాంలు మాట్లాడారు. నీట్ లీకేజీపై కేంద్రం ప్రభుత్వం స్పందించకుండా గ్రేస్ మార్కులు పొందిన వారి మార్కులు రద్దు చేయడం సరికాదన్నారు. వారికి మాత్రం మళ్లీ పరీక్ష నిర్వహిస్తామని చెప్పడమంటే పరీక్షలో అవకతవకలు జరిగాయని ప్రభుత్వం ఒప్పుకున్నట్లేనన్నారు. అలా చేస్తే నీట్ ర్యాంకులు తారుమారు అయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎన్‌టీఏ ఏకపక్షంగా వ్యవహరిస్తోందన్నారు. పరీక్షకు ఒక్క రోజు ముందు బీహార్ రాష్ట్రం పాట్నాలో 13 మంది విద్యార్థులను పేపర్ లీకేజీ విషయంలో అరెస్టు చేశారన్నారు. హర్యానా రాష్ట్రంలో కూడా ఒకే సీరియల్ నంబర్ గల ఎనిమిది మందికి టాప్ మార్కులు వచ్చాయన్నారు. రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో కూడా ఇలాంటి లీకేజీల అంశాలు ముందుకు వచ్చాయన్నారు. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏ ప్రస్తుత చైర్మన్, సభ్యులను తప్పించాలన్నారు. ఆందోళనలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, ఉపాధ్యక్షుడు నందు, ఎన్‌ఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రమేష్, ఆయా సంఘాల నాయకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఏరువాక సాగాలి..



కౌకుంట్లలో నిర్వహిస్తున్న ఎద్దుల బండ్ల ర్యాలీ

ఏరువాక పౌర్ణమి వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పశువులను కడిగి, అలంకరించారు. పంట పొలాల్లో నవధాన్యాలను చల్లి, ప్రత్యేక పూజలు చేశారు. దేవుళ్లకు నైవేద్యం పెట్టి, పంటలు బాగా పండాలని కోరుకున్నారు. సాయంత్ర ఎద్దుల బండ్లతో ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కౌకుంట్లలో ఏరువాక తాడును తెంపే కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట తాడును తెంచిన ఎద్దుల రైతుకు బహుమతిని అందించారు.

- దేవరకద్ర

వ్యక్తి హత్య

- రోకలిబండతో కొట్టి చంపిన భార్య



శ్రీను(ఫైల్)

తెలకపల్లి, జూన్ 22: భార్య భర్తను రోకలి బండతో కొట్టి చంపిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలం అనంతసాగర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ బి.నరేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బెల్లె శ్రీను(48) మద్యానికి బానిసగా మారాడు. భార్యతో నిత్యం గొడవ పడుతూ, ఇబ్బందులకు గురిచేసేవాడు. శుక్రవారం రాత్రి మద్యం తాగి వచ్చి, భార్య రాములమ్మతో ఘర్షణ పడ్డాడు. ఘర్షణలో రాములమ్మ భర్త తలపై రోకలి బండతో కొట్టింది. దాంతో శ్రీను తలకు బలమైన రక్త గాయమై, మరణించాడు. కుమారుడు శివ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కేసులు సత్వరం పరిష్కరించాలి

- హైకోర్టు న్యాయమూర్తి, నాగర్‌కర్నూల్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఎంజీ ప్రియదర్శిని

నాగర్‌కర్నూల్ క్రైం, జూన్ 22: కేసుల సత్వర పరిష్కారానికి న్యాయమూర్తులు చొరవ చూపాలని హైకోర్టు న్యాయమూర్తి, నాగర్‌కర్నూల్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని చెప్పారు. ఆమె నాగర్‌కర్నూల్ జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా నియామకమైన తర్వాత మొదటిసారి హైకోర్టు న్యాయమూర్తి టి.మాధవిదేవితో కలిసి శనివారం నాగర్‌కర్నూల్ కోర్టుకు వచ్చారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి డి.రాజేష్‌బాబు, కలెక్టర్ బదావత్ సంతోష్, వైభవ్ రఘునాథ్ వారికి పుష్పగుచ్ఛం అందించారు. వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఇరువురు హైకోర్టు న్యాయమూర్తులు కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు. తర్వాత జిల్లా కోర్టు హాల్‌లో జిల్లా జ్యుడీషియల్ హాల్, డిజిటల్ గ్రంథాలయం, మహిళా బార్ అసోసియేషన్ చాంబర్, వీడియో కాన్ఫరెన్స్ చాంబర్, జిల్లా కోర్టు ప్రాంగణంలో క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం జిల్లాలోని అన్ని కోర్టుల న్యాయాధికారులతో పెండింగ్ కేసుల పరిష్కారం, తదితర అంశాలపై సమావేశమయ్యారు. ఎంజీ ప్రియదర్శిని మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా కోర్టులో వివిధ ప్రారంభోత్సవాలు చేయడం ఆనందాన్ని కలిగించిందన్నారు. జిల్లాలో 14 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో రాజీ అవ్వదగ్గ కేసులను నేషనల్ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. రాజీ అవ్వదగ్గ కేసులైన సివిల్, మోటారు వెహికిల్స్, భార్యాభర్తల కేసులు, భాగ పరిష్కార కేసులు ఇరుపక్షాలు రాజీ కుదరడం ద్వారా ఇద్దరూ గెలిచిన వారు అవుతారన్నారు. అందుకే రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేసులను సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. ఆయా కోర్టుల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ జిల్లాలోని ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు అధికారులను కేటాయించాలని కోరారు. అందుకు ప్రియదర్శిని సానుకూలంగా స్పందించారు. హైకోర్టు జడ్జి మాధవిదేవి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ జిల్లా మహిళగా జిల్లాలో మొట్టమొదటి మహిళా అడ్వకేట్‌గా పని చేసిన అనుభవాన్ని సభాముఖంగా పంచుకున్నారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణ, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యుడు హనుమంతురెడ్డి, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి ఎంజీ ప్రియదర్శిని

సాగునీరు అందించాలి

- అందుకు అధికారులు తమ అధికారాలను ఉపయోగించాలి
- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- వనపర్తిలో అధికారులతో సమీక్ష




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, జూన్ 22: జిల్లాలోని రైతులకు సాగు నీరు అందించడానికి అధికారులు తమకున్న పూర్తి అధికారాలను ఉపయోగించుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. శనివారం వనపర్తి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితో కలిసి విద్య, వైద్యం, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ రైతులకు సాగునీరు ఇవ్వడానికి అధికారులు కృషి చేయాలన్నారు. కాలువల్లో జమ్ము ఉండటానికి వీల్లేదని, వెంటనే తొలగించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయానికి విధులకు హాజరు కావాలన్నారు. ఉపాధ్యాయుల హాజరుపై జిల్లా విద్యాధికారి, లేదా మండల విద్యాధికారి పర్యవేక్షణ ఉండాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద ఎంపికైన అన్ని పాఠశాలల్లో పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న సబ్ స్టేషన్లపై విద్యుత్ అధికారులతో మంత్రి ఆరా తీశారు. 2017-18లో మంజూరై, నిర్మాణం పూర్తయినా ప్రారంభించకపోవడానికి గల కారణాలపై ప్రశ్నించారు. గృహజ్యోతి పథకం కింద జిల్లాలో కేవలం 63 వేల మందికి మాత్రమే లబ్ధి జరిగిందని, మిగతా వారి పరిస్థితి ఏంటని ఆరా తీశారు.

వైద్యాధికారులు నిర్లక్ష్యం వీడాలి: మేఘారెడ్డి

ఆస్పత్రులకు అత్యవసర సేవల కోసం వచ్చే బాధితులను ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేసే సంస్కృతికి వైద్యాధికారులు స్వస్తి పలకాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. వారికి వెంటనే చికిత్స అందించాలన్నారు. రోగుల పట్ల సిబ్బంది అలసత్వం ప్రదర్శించొద్దన్నారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఉన్న విలువైన పరికరాలను ఉపయోగంలోకి తేవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులతో శాఖల వారీగా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేష్, మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, ఎంపీపీ కిచ్చారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.









28న జిల్లా స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూన్ 22 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో ఈనెల 28న జిల్లా స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు నిర్వహించనున్నామని డీవైఎస్‌వో శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పాఠశాలలో 4వ తరగతి ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలు ఉంటాయని, ప్రవేశాల కోసం ఎనిమిది నుంచి తొమ్మిది సంవత్సరాల వయస్సు ఉండి, 2015 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31 మధ్య కాలంలో జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్, హెచ్‌ఎం జారీ చేసిన మూడో తరగతి బోనఫైడ్, ఉత్తీర్ణత పత్రం, రెండు పాస్ ఫొటోలతో ఉదయం 8:30 గంటలకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మక్తల్, జూన్ 22 : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ శివారులో ఓ పొలం వద్ద నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకున్నట్లు ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన ఎరుకలి హన్మంతు వ్యవసాయ పొలం వద్ద రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారం అందుకొని దాడులు నిర్వహించామని ఎస్సై తెలిపారు.

అప్పిరెడ్డిపల్లిలో పీడీఎస్ బియ్యం..

నారాయణపేట రూరల్ : నారాయణపేట జిల్లా పరిధిలోని అప్పిరెడ్డిపల్లి గ్రామంలో శనివారం టాస్క్‌ఫోర్స్, పేట రూరల్ పోలీసుల దాడుల్లో 8.60 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. గ్రామంలో ఎం.కేశవులు అనే వ్యక్తికి చెందిన దుకాణంలో పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. బియ్యాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డీటీ పంచనామా అనంతరం కేసు నమోదు చేస్తామని హెచ్‌సీ వెంకటేశ్ తెలిపారు.







మేకల షెడ్ వద్ద నిద్రిస్తున్న వ్యక్తిని గొంతు కోసి హత్య

▸▸ కూతురి ప్రేమ వ్యవహారంపై పోలీసుల అనుమానం


ఆంజనేయులు (ఫైల్)


జడ్చర్ల, జూన్ 22 : మేకల షెడ్ వద్ద నిద్రిస్తున్న ఓ వ్యక్తిని గొంతు కోసి దారుణంగా హత్య చేసిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని రాజీవ్‌నగర్ కాలనీ సమీపంలో చోటు చేసుకున్నది. సంఘటనా స్థలాన్ని మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తమ బృందంతో వెళ్లి విచారణ చేపట్టారు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... జడ్చర్ల మునిసిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మేకం చిన్న ఆంజనేయులు (44) ప్రతీ రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి తన మేకల షెడ్ వద్ద మేకలకు కాపలాగా వెళ్లాడు. అక్కడే నిద్రించాడు. శనివారం ఉదయం ఆరు గంటలకు అక్కడకు వెళ్లి నిద్రిస్తున్న తన తండ్రిని కుమారుడు విజయ్‌కుమార్ పిలిచినా లేవకపోవడంతో అదే సమయంలో అక్కడికి వచ్చిన మరో వ్యక్తి సహాయంతో ఆంజనేయులును నిద్రలేపేందుకు యత్నించాడు. కాగా గొంతు కోసి హత్యకు గురైనట్లుగా వారిద్దరు గుర్తించారు. వెంటనే బాధిత కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆంజనేయులుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఇటీవల ఓ కుమార్తె ఒక యువకుడితో చనువుగా ఉండటం, తరచుగా ఫోన్‌లో మాట్లాడుతుండటాన్ని ఆంజనేయులు గమనించాడు. ఫోన్‌లో మాట్లాడవద్దని కుమార్తెను హెచ్చరించి, చేయి చేసుకున్నాడు. కుమార్తె, భార్యను దూషించాడు. కుమార్తె ప్రేమ వ్యవహారమే ఆంజనేయులు హత్యకు దారితీసిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. సంఘటనా స్థలం వద్ద క్లూస్‌టీంతో విచారించారు. హత్యకు గురైన ఆంజనేయులు కుమారుడు, భార్య, కుటుంబ సభ్యులతో డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు నడిపి ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

ఒకరి పట్టా మరొకరి పేరిట బదలాయింపు

అమ్రాబాద్, జూన్ 22 : గత ప్రభుత్వం 2017 సంవత్సరం నుంచి ధరణిని తీసుకువచ్చి రైతు బంధు పథకం ద్వారా వ్యవసాయ రైతులకు సహాయం అందించడంతో ఒకరి పట్టా భూమిని ఇంకొకరి పేరున చేసి రెవెన్యూ శాఖ అధికారులు నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలో అనేక అక్రమాలకు పాల్పడ్డారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ధరణి ఏర్పాటు అయిన తర్వాత ఇలాంటి కేసులు గ్రామానికి పదుల చొప్పున ఉంటాయి. రైతులు తమ భూములను సరి చేయించుకోవడానికి అమ్రాబాద్ తహసిల్ చుట్టూ తిరుగుతూ న్యాయం చేయాలని అధికారులను వేడుకుంటున్నా ఎలాంటి ఫలితం కనిపించడం లేదు.

మండల పరిధిలోని కుమ్మరోనిపల్లి గ్రామానికి చెందిన ఎడమ బాలసాయిలమ్మ తన పేరిట (సర్వేనెంబర్ 836లో ఒక ఎకరా ఎనిమిది గుంటలు పాస్ బుక్ నెంబర్ 2020040426) ఉన్న భూమి గత సంవత్సరం క్రితం అదే గ్రామానికి చెందిన జబ్బు పేద్దులు అనే వ్యక్తి తన తల్లి జబ్బు అలివేల పేరిట అక్రమంగా పట్టా చేయించుకున్నాడని బాధిత మహిళ శుక్రవారం విలేకరుల ముందు వాపోయింది. ఇదే పద్ధతిలో వంకేశ్వరంలో చనిపోయిన ఒక మహిళ పేరు మీద అదే గ్రామానికి చెందిన కొందరు దళారీలు పట్టా బుక్కు, ఆధార్ కార్డు సృష్టించి రుణాలు పొందిన విషయం విదితమే. ధరణి కారణంగా ఇలాంటి అక్రమాలు చోటు చేసుకున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.





చెంచు మహిళను
పరామర్శించిన మంత్రి జూపల్లి

- రూ. 2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించిన మంత్రి
- రూ. 50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి
  మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్

నాగర్‌కర్నూల్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : కౌలుదారుల పాశవిక దాడికి గురై నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మొలచింతలపల్లి తండాకు చెందిన చెంచు మహిళను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం పరామర్శించారు. ఇలాంటి ఘటన బాధాకరమన్నారు. ప్రభుత్వం అన్ని విధాలా బాధితురాలికి అండగా ఉంటుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. బాధిత మహిళ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చెంచు మహిళపై జరిగిన దాష్టీకం హేయమైన ఆటవిక చర్యగా అభివర్ణించారు. నలుగురు వ్యక్తులు బాధిత మహిళపై పాశవికంగా దాడి చేసి అమానవీయంగా ప్రవర్తించారన్నారు. నిందితులకు కఠినమైన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లా ఎస్పీతో పాటు ఇతర పోలీస్ అధికారులకు ఫోన్ చేసి నిందితులను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు వివరించారు. నిందితులను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారని, ఇలాంటి దాడులకు పాల్పడిన వారిని ఉపేక్షించేది లేదని, నిందితులకు కఠినశిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి రూ. 2 లక్షల ఆర్థిక సహాయం ప్రకటించారు. వారి ముగ్గురు ఆడపిల్లలకు రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యను అందిస్తామని, కుటుంబంపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రభుత్వం అండదండగా ఉంటుందని వెల్లడించారు.


మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చెంచు మహిళకు మెరుగైన చికిత్స అందించడంతో పాటు ప్రభుత్వం నుంచి రూ. 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, గువ్వల బాలరాజు, బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చెంచు మహిళను పరామర్శించారు. సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకొని ఆమె భర్తకు బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ. 1.50 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాడికి పాల్పడిన వారిపై ఇప్పటికీ కేసు కూడా నమోదు చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం స్పందించి బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రాజకీయ ఉనికి కోసం బీఆర్ఎస్ ప్రయత్నం
- ఎంపీ డాక్టర్ మల్లురవి

ఇటీవలే జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలువని బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాజకీయ ఉనికిని చాటుకోవడానికే చెంచు మహిళపై దాడి ఘటనను ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నం చేస్తున్నారని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లురవి విమర్శించారు. శనివారం ఎమ్మెల్యేలు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, డాక్టర్ రాజేష్‌రెడ్డిలతో కలిసి జిల్లా జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధిత చెంచు మహిళను ఎంపీ పరామర్శించారు. దాడికి గల కారణాలను బాధితురాలి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకుని మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంఘటనను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని, ఈ విషయం రాష్ట్ర స్థాయిలో ముఖ్యమంత్రి దృష్టికి పోయిన వెంటనే విచారణ జరిపించి బాధిత మహిళలకు న్యాయం చేయాలని డీజీపీ, సీఎస్‌ను ఆదేశించారని పేర్కొన్నారు. అంతేకాకుండా వెంటనే ఆ కుటుంబానికి రూ.నాలుగు లక్షలు చెల్లించడా నికి ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు.

రెండో నిందితుడిని శిక్షించాలి

మన్ననూర్ : కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లిలో చెంచు మహిళపై దాడి దుర్ఘటనలో రెండో ప్రధాన నిందితుడిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపాలని పౌర హక్కుల సంఘం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్క బాలయ్య, కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్న బాధితురాలిని శనివారం పరామర్శించిన ప్రజా సంఘాల నాయకులు మన్ననూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధితురాలు కుటుంబానికి రూ.25లక్షలు ఎక్స్‌గ్రేషియాతో పాటు, మహిళకు ప్రభుత్వ ఉద్యోగం, వ్యవసాయ పొలం ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర కోకన్వీనర్ అంబయ్య, ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బల్మూరి గోపాల్, తెలంగాణ నిర్వాసిత వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు అనిల్ పాల్గొన్నారు.

మహిళకు భద్రత కల్పించి, ప్రభుత్వపరంగా ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్ క్రైం : ఆదివాసి మహిళకు భద్రత కల్పించి ప్రభుత్వపరంగా ఆదుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా న్యాయవాదులు తగిలి కృష్ణ, తెలుగు నరసింహులు, వెంకటేశ్వర్లు, మహ్మద్ ఇలియాజ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌ను కలిసి ఆదివాసి మహిళపై దాష్టీకానికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి సత్వర న్యాయంతో పాటు బాధిత కుటుంబానికి భద్రత కల్పించి న్యాయం చేయాలని న్యాయవాదులు వినతిపత్రాన్ని అందజేశారు.

అలంపూరు అభివృద్ధిపై దృష్టి
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి

అలంపూరు, జూన్ 22 : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూరు అభివృద్ధిపై దృష్టి పెడతానని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. శనివారం శ్రీజోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారిని ఆయన దర్శించుకున్నారు. చిన్నారెడ్డికి దేవస్థానం ఈవో పురేందర్ కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారి ఆలయంలో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఆ తర్వాత ఆలయ అధికారులు చిన్నారెడ్డిని శేషవస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం చిన్నారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివిధాల సహాయ సహకారాలందిస్తామని అన్నారు. అలంపూరు చౌరస్తాలో ఈనెలాఖరులోగా వంద పడకలు, అలంపూర్‌లో 50 పడకల ఆసుపత్రిని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ప్రారంభిస్తారని మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తెలిపారు. అలాగే అలంపూరు చౌరస్తా నుంచి అలంపూరు వరకు ఫోర్‌వే సెంట్రల్ లైటింగ్ రహదారి, ఆర్డీఎస్ సమస్యలు, తుమ్మిళ, మల్లమ్మకుంట, జూరాల సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఇక్కడున్న హాస్టళ్లు ఎక్కడికీ వెళ్లవని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బేగం గోకారి, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నరసింహ, పట్టణ అధ్యక్షులు, కార్యకర్తలు ఉన్నారు.


జోగుళాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న చిన్నారెడ్డి

పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతాం

పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతామని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా స్నేక్ సొసైటీ ఫౌండర్, వనపర్తి జిల్లాకు చెందిన చీరాల కృష్ణకుమార్‌సాగర్ ఆధ్వర్యంలో హరిత టూరిజం హోటల్‌లో పాదయాత్ర కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అలంపూరు నుంచి హైదరాబాద్ వరకు హైవే రహదారి పక్కన, గ్రామాల్లో, స్కూల్స్ కాలేజీలు తదితర ప్రదేశాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మొదలుపెట్టడం గొప్ప సంకల్పమని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు ఒక మొక్కను నాటి కాలుష్యాన్ని నివారించాలని తెలిపారు.

కోటకొండలో పోకిరీల వీరంగం

- దళితవాడలో ఇళ్లపై దాడులు
- గ్రామంలో ఉద్రిక్తత

నారాయణపేట, జూన్ 22 : నారాయణపేట జిల్లా పరిధి కోటకొండ గ్రామం దళితవాడలోని పలువురి ఇళ్లపై పోకిరీలు శనివారం కర్రలతో దాడులకు దిగడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థి తులు నెలకొన్నాయి. దాడులతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న భయం గ్రామస్థుల్లో నెలకొంది. ఈమధ్యకాలంలో పలువురు పోకిరీ యువకుల మధ్య విబేధాలు తలెత్తడంతో అది కాస్తా కులాల వారీగా చీలి యువకుల మధ్య చిచ్చు రేపేందుకు కారణమైందని గ్రామస్థులు తెలిపారు. ఈనెల 21న ఏరువాక పండగ రోజు ఏరువాక తాడు తెంపే క్రమంలో బీసీ, మాల, దళిత యువకుల మధ్య ఘర్షణ జరిగి దళితవాడకు చెందిన పలువురు యువకులపై బీసీ, మాల యువకులు దాడి చేయడంతో పోలీసులను దళితులు ఆశ్రయించారు. శుక్రవారం రోజు జరిగిన సంఘటనతో ఆగ్రహంగా ఉన్న దళిత యువకులు శనివారం గ్రామంలో తిరుగుతుండగా తమపై దాడి చేసిన ఓ మాల యువకుడిని చితకబాదారు. ఈ విషయం కాస్తా గ్రామంలో దావనంలా వ్యాపించడంతో పలువురు బీసీ, మాల యువకులు రెచ్చిపోయి దళితుల ఇళ్లపై దాడులకు దిగారు. అలాగే పలువురు దళితులు బీజేపీ కార్యాలయంలో ఉండడంతో అక్కడా దాడిచేసి పార్టీ కార్యాలయంలోని ఫర్నిచర్లు ధ్వంసం చేశారు. హరిజన్ బాలప్ప, కిందింటి కృష్ణలు దాడిలో గాయపడ్డారు. పోకిరీ యువకుల మధ్య నెలకొన్న వివాదం జఠిలమై వర్గాల మధ్య కులచిచ్చుతో ఉద్రిక్తతకు దారి తీసింది. నారాయణపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో తమపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని హరిజన్ బాలప్ప ఫిర్యాదు చేశారు. దీంతో కోటకొండ గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.


కోటకొండ గ్రామంలో బీజేపీ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న పార్టీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ

బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కోటకొండలో బీజేపీ కార్యాలయంపై దాడిచేసి ఫర్నిచర్‌ను ధ్వంసం చేసిన అల్లరిమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలోని పార్టీ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న చంద్రప్పపై ఏరువాక సందర్భంగా తాగుబోతులు దాడి చేశారని దాంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం మళ్లీ తాగుబోతులు చంద్రప్పపై దాడి చేయడమే కాకుండా దళితవాడలోని ఇళ్లను తిరిగి దాడులతో భయభ్రాంతులకు గురి చేశారన్నారు. కొందరు దళితులు బీజేపీ కార్యాలయంలో తలదాచుకోగా దాడిచేసి గాయపర్చారని వారందరూ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఘటనను ఎస్పీ, డీఎస్పీల దృష్టికి తీసుకెళ్లామని, దోషులపై చర్యలు తీసుకుంటామని వారు చెప్పారని నామాజీ తెలిపారు. కేంచే శ్రీనివాస్, సాయిబన్న, రాములు ఉన్నారు.

యువతి అదృశ్యం
- కేసు నమోదు

తెలకపల్లి, జూన్ 22 : నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఓ మండలంలో యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై బి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గ్రామానికి చెందిన యువతి ఈనెల 18 తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు యువతి ఆచూకీ కోసం వెతికారు. ఫలితం లేకపోవడంతో యువతి తల్లి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మామిడి, జామ చెట్లు నరికివేత

మరికల్, జూన్ 22 : నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు రైతుల వ్యవసాయ పొలంలో మామిడి, జామ చెట్లు, పైపులైన్, గేట్‌వాల్‌ను ధ్వంసం చేశారు. మండల కేంద్రంలోని కట్టెకొండ రాజు, మడ్డి వెంకటయ్యలకు మండల శివారులోని సర్వేనెంబర్ 319, 320లలో ఐదెకరాల మూడు గుంటల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయ పొలంలో అక్కడక్కడా ఉన్న మామిడి, జామ చెట్లు, పైపులైన్, గేట్‌వాల్‌ను శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. శనివారం గమనించిన రైతులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.


నరికిన మామిడి చెట్టు

వట్టెం, బిజినేపల్లి ఆలయాల్లో
హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు


బిజినేపల్లి వెంకన్న ఆలయంలో హైకోర్టు జడ్జిలను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

బిజినేపల్లి, జూన్ 22 : మండల కేంద్రంలోని ఆనందగిరి లక్ష్మీవేంకటేశ్వర స్వామి, వట్టెం గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జిలు ప్రియదర్శిని, మాధవి దంపతులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చకులు వారికి మేళతాళాలు, పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకొని ఆలయ విశిష్టతను అడిగి తెలుసున్నారు. ఆలయం కొండపై ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, ఇక్కడి నుంచి చుట్టు ఉన్న గ్రామాలతో పాటు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వెంకటాద్రి రిజర్వాయర్ చూపరులను ఆకట్టుకుంటోందన్నారు. పక్కనే అయ్యప్పస్వామి ఆలయంతో పాటు వివిధ ఆలయాలతో కొండపై ఆధ్యాత్మిక భావన వెల్లివిరుస్తోందని ఆనందం వ్యక్తం చేశారు. హైకోర్టు జడ్జి దంపతులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. వారి వెంట జిల్లా కోర్టు జడ్జిలు, జిల్లా జడ్జిలు రాజేష్‌బాబు, మౌనిక, మమత, శ్రీనిధి, సబిత పలువురు న్యాయవాదులు ఉన్నారు.

జోగుళాంబను దర్శించుకున్న నీతి ఆయోగ్ సభ్యులు


నీతి ఆయోగ్ సభ్యులకు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

అలంపూరు, జూన్ 22 : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండల కేంద్రంలోని శ్రీజోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి వారిని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వీకే.సరస్వత్ శనివారం దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం ఈవో పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్‌శర్మ పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామివారి ఆలయంలో అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో అర్చనలు వంటి విశేష పూజలు చేయించారు. అనంతరం సభ్యులను శేష వస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఆలయంలో భక్తుల రద్దీ

ఏరువాక పౌర్ణమి సందర్భంగా జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ప్రతీ అమావాస్య, పౌర్ణమి నాడు ఆలయంలో జరిగే చండీహోమాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి ఆలయంలో అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో త్రిశతి అర్చనలు, కుంకుమార్చనలు, ఖడ్గమాల వంటి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు చీర, గాజులు, వడిబియ్యాన్ని అమ్మవారికి చెల్లించి మొక్కుబడులను తీర్చుకున్నారు.

ఉరి వేసుకొని ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య

- భార్యకు లొకేషన్ షేర్ చేసి బలవన్మరణం
- సోదరులు వచ్చేలోపే జరిగిపోయిన ఘోరం
- పుల్లూరు శివారులో ఘటన

అలంపూర్ చౌరస్తా, జూన్ 22 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం పుల్లూరు గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కోడుమూరు మండలం, మూడుమాలగుర్తి గ్రామానికి చెందిన గొల్ల మల్లికార్జున్(41) పోస్టల్ శాఖలో ఉద్యోగం చేస్తున్నాడు. భార్య సోమదేవి, ఇద్దరు కూతుళ్లతో కలిసి కర్నూలు నగరంలోని వెంకటరమణకాలనీలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం నుంచి మల్లికార్జున్ కన్పించకుండా పోవడంతో ఆచూకీ కోసం భార్య, బంధువుల సాయంతో గాలింపులు చేపట్టారు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం భార్య వాట్సాప్‌కు మల్లికార్జున్ లొకేషన్ షేర్ చేశాడు. వెంటనే సమాచారం అందుకున్న సోదరులు గిరిబాబు, అనిల్ హుటాహుటిన పుల్లూరు శివారులోని రిలయన్స్ పెట్రోల్‌బంకు ఎదుట జాతీయ రహదారికి సుమారు 200 వందల మీటర్ల దూరంలో వెళ్లి చూడగా ఓ ముళ్ల చెట్టుకు ఉరి వేసుకొని కన్పించాడు. వెంటనే ఉండవల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై శ్రీనివాస్‌నాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కానీ అప్పటికే అతను మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. ఘటనా స్థలంలో ఆత్మహత్యకు ముందు సమీపంలో మద్యం తాగిన ఆనవాళ్లు గుర్తించారు. మల్లికార్జున్‌కు విపరీతమైన బ్యాక్‌పెయిన్ ఉందని, అందుకే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని బంధువులతో తాము జరిపిన ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు.

వేధింపులకు తాళలేక వ్యక్తి..

నవాబ్‌పేట, జూన్ 22 : భూవిక్రయ వేధింపులు తాళలేక ఓ వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కారూర్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని నాగోల్‌కు చెందిన కమ్మరి విఠలాచారి కొంతకాలం క్రితం కారూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 171లో ఉన్న తన సొంత భూమిని రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పాల్మాకులకు చెందిన ముష్టి వెంకటేష్, తిరుపతి, రమేష్, మోహన్ అనే నలుగురు వ్యక్తులకు విక్రయించాడు. ఈ క్రమంలో ఆ నలుగురూ రూ.50 వేలు అడ్వాన్సుగా చెల్లించారు. ఆ తర్వాత భూమికి బాట లేదని విఠలాచారిని నిత్యం వేధించసాగారు. ఈ విషయమై పలుమార్లు ఇరువర్గాలకు గొడవ జరిగింది. దీంతో ఈనెల 21న తన స్నేహితుల వద్ద డబ్బులు తీసుకువస్తానని ఇంటి నుంచి బయలుదేరిన విఠలాచారి రాత్రయినా ఇంటికి రాకపోవడంతో భార్య భాగ్యమ్మ భర్తకు ఫోన్ చేసింది. ఆ తర్వాత మళ్లీ ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. శనివారం ఉదయం విఠలాచారి వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన బంధువు కమ్మరి శ్రీశైలం విఠలాచారి భార్యకు ఫోన్ చేసి విషయం తెలిపాడు. తన భర్త ఆత్మహత్యకు పైనలుగురు వ్యక్తులే కారణమని ఆరోపిస్తూ ఆమె శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు.

లాడ్జిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి..

జడ్చర్ల : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న హోటల్ సింధూర లాడ్జిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చాకల సురేశ్(36) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జడ్చర్ల ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గుంతకల్లు ప్రాంతానికి చెందిన సురేశ్ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సురేశ్ భార్య మంజూష, మూడు సంవత్సరాల కుమార్తె యాషికాతో కలిసి హైదరాబాద్‌లోని చందానగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈనెల 20న షాద్‌నగర్‌లో పని ఉందని భార్యకు చెప్పి ఇంటి నుంచి బయలుదేరిన సురేశ్ జడ్చర్లలోని హోటల్ సింధూర లాడ్జిలో ఈనెల 21న క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ పరిస్థితుల్లో నాకు జీవించుటకు ఇష్టంలేదు.. అనే సూసైడ్ నోట్ రాశాడని పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జడ్చర్ల ఏరియా ఆసుపత్రికి తరలించామని, సురేశ్ భార్య మంజూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

కలప ట్రాక్టర్ల పట్టివేత

ఖిల్లాఘణపురం, జూన్ 22 : వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం ఫారెస్టు రేంజ్ పరిధిలో అనుమతి లేకుండా కలప రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అటవీశాఖ రేంజర్ అధికారి పి.మంజుల తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమందడి మండలం వీరాయిపల్లి శివారులోని సామిల్‌కు కలపను రవాణా చేస్తున్న ఒక ట్రాక్టర్‌ను, ఘణపురం మండల కేంద్రంలో ఇటుక బట్టీకి కలపను తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా చెట్లను నరికి వేయడం చట్టరీత్యా నేరమని ఆమె పేర్కొన్నారు. సొంత పొలంలోని ఒక చెట్టును నరికి వేయడానికి ఆన్‌లైన్‌లో రూ.500 చెల్లించి అటవీశాఖ అనుమతులు పొందాలని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా అనుమతులు లేకుండా కలప రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ఊరేగింపు వాహనాల విరాళం



బిజినేపల్లి వేంకటేశ్వర స్వామికి తెనాలికి చెందిన భక్తుడు విరాళంగా అందజేసిన ఊరేగింపు వాహనాలు

బిజినేపల్లి, జూన్ 22 : ఉత్సవాల్లో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగించేందుకు అవసరమైన ఇత్తడితో చేసిన గరుడ, అశ్వ, శేష వాహనాలను తెనాలికి చెందిన భక్తుడు శ్రీనివాసులు అందజేసినట్లు ఆలయ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం ఆలయంలో ఆలయ ప్రధాన పూజారికి రూ. 2లక్షల విలువైన ఊరేగింపు వాహనాలను భక్తుడు శ్రీనివాసులు అందజేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు దాతను, ప్రోత్సహించిన విజయ రాఘవచారిలను ఘనంగా సన్మానించారు. వారి వెంట ఆలయ కమిటీ సభ్యులు కావలి నిరంజన్, ఎంపీటీసీ సభ్యుడు చీర్డం బాలస్వామి, రాజేందర్ గౌడ్, హరికిషన్, నరసింహ స్వామి, పూరి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

రైతు బిడ్డ రాష్ట్రాన్ని స్వర్ణయుగం చేయబోతున్నారు..



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

అచ్చంపేట, జూన్ 22: రైతు బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని స్వర్ణయుగం చేయబోతున్నారని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో అచ్చంపేట నియోజకవర్గంలోని పోడు రైతులకు పట్టాలు అందిస్తామన్నారు. బల్మూరు మండలంలో చేపట్టబోయే ప్రాజెక్టుల నిర్మాణానికి ముఖ్యమంత్రి వస్తారన్నారు. నియోజకవర్గంలోని పది చెరువుల మరమ్మతుల కోసం నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. కాంగ్రెస్ నాయకులు గోపాల్ రెడ్డి, శ్రీనివాసులు, కాశన్న యాదవ్, మల్లేష్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీయూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర సహాయ కార్యదర్శి అబ్దుల్లాఖాన్



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అబ్దుల్లాఖాన్

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 22: టీయూడబ్ల్యూజే హెచ్ 143 రాష్ట్ర సహాయ కార్యదర్శి, సీనియర్ జర్నలిస్టు మహ్మద్ అబ్దుల్లాఖాన్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాదులో సీఎంను కలిసిన ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దానికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

గ్రూప్-2,3 కేటగిరిలోని ఖాళీలను భర్తీ చేయాలి

కొల్లాపూర్, జూన్ 22 : గ్రూప్-2,3 కేటగిరిలోని ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు దార శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో దార శేఖర్ మాట్లాడుతూ గ్రూప్-2,3 కేటగిరిల్లో ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేసినప్పటికీ మరిన్ని ఖాళీలు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించిందని, వాటిని కూడా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు వెంటనే నోటిఫికేషన్లు జారీ చేయాలన్నారు. ఉద్యోగ నియామక సంస్థలు నిర్వహించే పరీక్షలను పూర్తిగా పారదర్శకంగా చేపట్టాలని, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పకడ్బందీగా నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 రాసిన అభ్యర్థుల సంఖ్యను వెంటనే ప్రకటించాలని, గ్రూప్-1 ప్రిలిమ్స్ రాసిన అభ్యర్థులకు కేటగిరైజేషన్ ప్రకారం కటాఫ్ మార్కుల ద్వారా మెయిన్స్‌కు అభ్యర్థులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో ఎక్కువ దిగుబడి సాధించవచ్చు

తాడూరు, జూన్ 22 : ప్రస్తుతం రైతులందరూ సేంద్రియ పద్ధతిలో వ్యవసాయాన్ని అవలంబించినట్లయితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడిని సాధించి అధిక లాభాలను పొందుతారని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల అధికారి చక్రపాణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో సేంద్రియ పద్ధతులు, ఆయిల్‌పామ్ వంటి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసి ఎక్కువ దిగుబడి సాధించవచ్చని రైతులకు వివరించారు. ఎస్సీ ఎస్టీ రైతులకు 90శాతం సబ్సిడీ డ్రిప్, మొక్కల మీద పూర్తి రాయితీ వివరాలను తెలియజేశారు. వానకాలంలో పత్తి, వరిలో చేపట్టాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ఉద్యానవన అధికారి లక్ష్మణ్ మిరప పంటపై వచ్చే చీడపీడలు, వాటి నివారణ చర్యలు గురించి రైతులకు వివరించారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్, జూన్ 22 : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో శివాలయం సమీపంలో రిటైర్డు రెవెన్యూ ఉద్యోగి అరుణ్‌కుమార్ ఇంటి నుంచి దూరయ్య ఇంటి వరకు డ్రైనేజీ కాల్వ సమస్యను పరిష్కరించాలని శనివారం మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, వైస్ చైర్‌పర్సన్ మహెముదాబేగంకు కాలనీవాసులు మొరపెట్టుకున్నారు. శివాలయం సమీపంలో నూతనంగా చేపట్టిన నిర్మాణాల వల్ల తమ డ్రైనేజీ నీరు సక్రమంగా పారేందుకు మునిసిపల్ ఆధ్వర్యంలో డ్రైనేజీ వ్యవస్థ నిర్మించాలని కాలనీవాసులు ప్రజాప్రతినిధులతో మొరపెట్టుకున్నారు. అదేవిధంగా మల్లపురాజు కుంట భూమి కూడా ఆక్రమణకు గురవుతున్నదని, స్థలాన్ని పరిరక్షించాలని కాలనీవాసులు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లోపు డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపుతామని మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య కమిషనర్ శ్రీనివాసన్‌లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖాదర్‌పాషా, మెహిదీనవాజ్, పంజాబీ తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని సన్మానించిన మాజీ ఎంపీ



కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న రాములు

కల్వకుర్తి, జూన్ 22 : కేంద్ర మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని మాజీ ఎంపీ రాములు పూల మాల, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి సహాయ సహకారాలు అందించాలని కేంద్రమంత్రిని కోరినట్లు రాములు తెలిపారు. సన్మానించిన వారిలో పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు పాల బిల్లులు చెల్లించాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఊర్కొండ, జూన్ 22: పాడి రైతులకు పాల బిల్లులు వెంటనే చెల్లించి ఆదుకోవాలని బీజేపీ ఆధ్వర్యంలో కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తహసీల్దార్ చెన్న కిష్టన్నకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ పాడి రైతులకు రెండు నెలల నుంచి బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారికి వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులు రాజేందర్ గౌడ్, పరుశరామ్, వెంకట్, బ్రహ్మచారి ఉన్నారు.

మిషన్ భగీరథ ట్యాంకులకు భద్రతేదీ?

- గుట్టపై కంప్రెషర్‌తో బ్లాస్టింగ్
- విద్యుత్ యంత్రాలతో కటింగ్ వల్ల కనుమరుగవుతున్న గుట్టలు
- విద్యుత్ చౌర్యం పట్టించుకోని అధికారులు



గుట్టపై తీస్తున్న కడీలు

ఊర్కొండ, జూన్ 22: గత ప్రభుత్వ హయాంలో లక్షల రూపాయలు వెచ్చించి మిషన్ భగీరథ ట్యాంకులను గుట్టపై ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉమ్మడి మిడ్జిల్ మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు అందిస్తున్న వాటికి భద్రత కరువైంది. ఆ గుట్టపై పెద్ద ఎత్తున బ్లాస్టింగ్‌లు చేస్తూ క్వారీలు ఏర్పాటు చేసుకున్న దళారులు గుట్టలను తొలుస్తూ నిర్వహిస్తున్న వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా తమ వ్యాపారాన్ని విస్తరింపచేసుకుంటున్నారు. రూ.కోట్లను గడిస్తూ అధికార యంత్రాంగంతో పాటు గ్రామంలో ప్రశ్నించిన వారిపై దాడులకు సైతం దిగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఈ సంఘటనలు నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట, నర్సంపల్లి శివారులో వెలసిన గుట్టలపై తరచుగా చోటు చేసుకుంటున్నాయి. గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా గత ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధుల అండతో అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారు.

బెల్లం గుట్టను పూర్తిగా ధ్వంసం చేశారు

మైనింగ్ వ్యాపారులు బెల్లం గుట్టను అనుమతుల పేర పూర్తిగా ధ్వంసం చేశారు. బ్లాకులుగా తయారు చేసి యంత్రాల ద్వా రా కటింగ్ చేసి గృహాల్లో వా డే గ్రానైట్‌గా మలిచి కోట్ల రూపాయలు అర్జించారు. రెం డు గ్రామాల మధ్యన ఎత్త యిన గుట్టగా పేరొందినది పూర్తిగా ధ్వంసం కావడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ యంత్రాలతో...

గుట్టలో కడీలు, రాయి తీయడానికి గతంలో చేతులతో తొలచే వారు. అటువంటి పద్ధతికి స్వస్తి పలికి విద్యుత్ యంత్రాలను వాడుతున్నారు. 10 మంది కలిసి పది రోజుల చేసే పనిని యంత్రాలు ఒకే రోజు చేస్తుండటం తో దళా రులకు కాసుల వర్షం కురుస్తున్నది. దాంతో దళా రులందరు విద్యు త్ చౌర్యం చేస్తూ విద్యుత్ అధికారులను తమ గుప్పిట్లో పెట్టుకొని వారికి ఆమ్యామ్యాలు అప్పగిస్తూ విద్యుత్ యంత్రాల ద్వారా గుట్టలను ధ్వంసం చేస్తున్నారు.

హనుమండ్ల గుట్టను కాపాడాలి



ఊర్కొండపేట శివారులో ఉన్న హనుమాన్ గుట్టపై బ్లాస్టింగ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి, మిషన్ భగీరథ ట్యాంకులతో పాటు స్వామివారి కోనేరు ఉంది. గుట్టపూ కడీలు, గ్రానైట్ తీయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి

- బొల్గం మల్లేష్‌గౌడ్, రైతు, ఊర్కొండపేట

ఆనవాళ్లు లేకుండా స్వామివారి కోనేరు!

ఊర్కొండపేట శివారులో వెలసిన అభయాంజనేయ స్వామివారి కోనేరు హనుమాండ్ల గుట్టపై ఉంది. స్వామి వారు కోనేరులో స్నానం ఆచరించే వారు అనే నమ్మకంతో భక్తులు సైతం కోనేరులో స్నానం చేస్తే కోరిన కోరికలు తీరుతాయని అష్టకష్టాలు పడుతూ భక్తులు స్నానం చేయడానికి గుట్టపైకి వెళతారు. ఇటువంటి కోనేరును సైతం దళారులు వదలడం లేదు. దాని పరిసర ప్రాంతంలోనే క్వారీలు ఏర్పాటు చేసి బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తూ కోనేరును ధ్వంసం చేస్తున్నారు.

అధికారులు సమష్టి కృషి చేయాలి



ఎంపీ మల్లురవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

నాగర్‌కర్నూల్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమిష్టి కృషి చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, డాక్టర్ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణలతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కలవడానికి రాగా, కలెక్టర్ బదావత్ సంతోష్ ఎంపీకి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లాలోని వివిధ సమస్యలపై కలెక్టర్‌తో నీటిపారుదల, వైద్యారోగ్య, విద్య, పౌరసరఫరాలు, విద్యుత్ శాఖల అధికారులతో వారు సమీక్షించారు. ఈ సందర్భంగా వారు అధికారులతో మాట్లాడుతూ వైద్య రంగానికి ఈ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని, జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కావాల్సిన వసతుల ఏర్పాట్ల రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి బడ్జెట్, సిబ్బంది నియామకం అంశాలపై చర్చించి ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై నీటిపారుదల అధికారులతో సమీక్ష జరిపారు.

ఎంపీ మల్లు రవికి ఘన స్వాగతం

నాగర్‌కర్నూల్ టౌన్: నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు ఎంపీ మల్లు రవికి శనివారం జిల్లా కేంద్రంలో ఘన స్వాగతం లభించింది. ఎన్నికల్లో విజయం సాధించాక మొట్ట మొదటి సారిగా జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద స్థానిక ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి స్వాగతం పలికారు. బస్టాండు కూడలి వద్ద కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను గజమాలతో సన్మానించారు.

హామీలు అమలు చేస్తాం

బిజినేపల్లి: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల ముందు ప్రజలకు కాంగ్రెస్ పా ర్టీ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తామని నాగర్‌కర్నూ ల్ ఎంపీ మల్లు రవి అన్నారు. మండలంలోని వట్టెం వెంకన్న స్వామి ఆలయంలో శనివారం ఎమ్మెల్సీ దామో దర్ రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్ రెడ్డితో కలిసి ప్రత్యే క పూజలు చేశారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆయన వెంట జిల్లా మైనార్టీ నాయకుడు హబీబ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కూచకుళ్ల సుహాసన్ రెడ్డి, అమృత్ రెడ్డి, రాంచందర్, మిద్దె రాములు, వెంకటస్వామి, భగవంత్ గౌడ్, రాగి మధుసూదన్ రెడ్డి, గోవిందు నాయక్, జీహెచ్ఎంసీ ప్లానింగ్ కమిషనర్ సందడి దేవేందర్ రెడ్డి, సందడి ప్రతాప్ రెడ్డి, సందడి నరేందర్ రెడ్డి, సందడి సురేందర్ రెడ్డి, ఖలీల్, శ్రీనివాస్ గౌడ్ ఉన్నారు.

● తిమ్మాజిపేట: డాక్టర్ మల్లురవికి శనివారం తిమ్మాజిపేట మండల పరిధిలోని మరికల్ దగ్గర ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డిలు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలోని ముఖద్వారం వద్దకు చేరుకున్న ఎంపీ డాక్టర్ మల్లురవికి డప్పు కళాబృందం వారిచే డప్పులు వాయిస్తూ స్వాగతించారు. మరికల్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. వాహనాలలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. నాయకులు మల్లయ్యగౌడ్, శ్రీని వాస్ బహదూర్, వెంకట్రాంరెడ్డి, ఉస్మాన్, మాధవులు, దేవ స్వామి, లింగం, రవూఫ్, నాగసాయిలు పాల్గొన్నారు.

ఆసుపత్రి ముందు వాల్మీకి సంఘం, ఎమ్మార్పీఎస్ ధర్నా



ధర్నా చేస్తున్న వాల్మీకి సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు

కొల్లాపూర్, జూన్ 22 : కొల్లాపూర్ పట్టణంలోని సాయికృప ఆసుపత్రి యజమాని కొండా శ్రీను పెట్టిన వేధింపుల కారణంగానే లక్ష్మీ మృతి చెందిందని అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయికృప ఆసుపత్రి ముందు వాల్మీకి సంఘం, ఎమ్మార్పీఎస్ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పీ జిల్లా నాయకులు మంద నరసింహ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి, వాల్మీకి సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు పరుశరామ్‌నాయుడు, జర్నలిస్టు అవుట రాజశేఖర్ మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాల క్రితం ఆరోగ్యం బాగాలేదని వెల్టూరు గ్రామానికి చెందిన లక్ష్మీ వైద్యం కోసం కొల్లాపూర్ పట్టణంలో సాయికృప ఆసుపత్రికి వచ్చింది. ఆసుపత్రి నిర్వాహకులు చేసిన వైద్యం వికటించడంతో నిజాలు బయటకు పొక్కకుండా కప్పిపుచ్చుకునేందుకు బాధితురాలిని ఆసుపత్రిలోనే మెడికల్ షాపులో యాజమాన్యం పనికి పెట్టుకున్నది. కొన్ని నెలల తర్వాత మెడికల్ షాపులో 40లక్షల రూపాయల డబ్బులు అపహరించిందని వేధించారని గతంలో కొల్లాపూర్ ఎస్ఐగా విధులు నిర్వహించిన ఎస్ఐ బాలవెంకటరమణచే తప్పుడు కేసులు పెట్టించారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలు ఆసుపత్రి నిర్వాహకుల వేధింపులు భరించలేకే చనిపోయిందని, లక్ష్మికి న్యాయం జరిగేలా ఆసుపత్రి నిర్వాహకులు కొండా శ్రీనుపై చర్యలు తీసుకోవాలని సాయికృప ఆసుపత్రిని వెంటనే సీజ్ చేయాలని డిమాండ్‌చేశారు. వాల్మీకి సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులతో సీఐ కే.మహేష్, ఎస్ఐ రుషికేష్ మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బా ధిత కుటుంబ సభ్యులు, నాయకులు లక్ష్మీ కుమార్తెకు న్యాయం చేకూర్చాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నాయకు లు పుట్టపాగ రాము, వాల్మీకి సంఘం నాయకులు ప్ర సాద్, వెంకటేశ్‌నాయుడు, రామకృష్ణ, రాంచందర్‌నాయు డు, జీవన్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు, గోవర్ధన్‌నా యు డుతో పాటు బాధిత కుటుంబు సభ్యులు పాల్గొన్నారు.

కక్షపూరితంగానే..

కక్షపూరితంగా వ్యవహరిస్తూ కావాలనే మా పరువుకు భంగం కలిగిస్తున్నారని సాయికృప ఆసుపత్రి డాక్టర్ కొండా శ్రీదేవి పేర్కొన్నారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలో విలేకర్ల సమావేశంలో ఆర్యవైశ్య సంఘం నాయకులతో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. గడిచిన ఐదు సంవత్సరాల నుంచి చిన్నంబావి మండలం వెల్టూరు గ్రామానికి చెందిన లక్ష్మీ వైఫ్ ఆఫ్ వెంకటేశ్ అనే మహిళ తమ ఆసుపత్రిలోని మెడికల్ షాపులో దొంగతనం చేసిందని తమకు న్యాయం చేయాలని గడిచిన సంవత్సరంలో కొల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టినట్లు పేర్కొన్నారు. భార్యాభర్తల గొడవ కారణంగా ఆమె ఆత్మహత్య చేసుకుందని విచారణలో కూడా తేలిందని ఆమె పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆకుతోట సుదర్శన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు శేషయ్య, ఏఎం స్వామి, గుంత బాలయ్య, మనోహర్, సాయిబాబు, కృష్ణయ్య, భీంశెట్టి రాము, రఘుశెట్టి, లక్ష్మణ్‌శెట్టి పాల్గొన్నారు.

ఆముదం సాగు నల్లమల రైతులకు లాభదాయకం

మన్ననూర్, జూన్ 22: ఆముదం పంట సాగు చేయడం వలన నల్లమల అభయారణ్య ప్రాంత రైతులు అధిక లాభాలు పొందవచ్చునని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆముదం విభాగం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.వర్ధిని, డాక్టర్ కె. సదయ్య, డాక్టర్ జి.ఈశ్వర్‌రెడ్డి, డాక్టర్ దివ్యారాణి తెలిపారు. అమ్రాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాల రైతులకు ఆముదం పంట సాగు-యాజమాన్యంపై మన్ననూరులోని రైతు వేదికలో శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులకు తక్కువ దిగుబడితో అధిక లాభాలు గడించే పంటల సాగు పద్ధతులను వివరించారు. ముఖ్యంగా నల్లమల ప్రాంతంలోని మన్ననూరు, అమ్రాబాద్, వటవర్లపల్లి పరిసర గ్రామాల్లో కోతుల బెడద అధికంగా ఉందని, పంటలు సాగు చేయడం కష్టంగా మారిందని రైతులు తమ అభిప్రాయాలను శాస్త్రవేత్తలకు వివరించగా, రైతుల బాధలు విన్న వారు సూచనలు చేశారు. ఆముదం పంటను సాగు చేయడమే ఈ ప్రాంత రైతులకు మేలని, ఆముదం కాయలను కోతులు నష్టపరుచవని, ఈ పంటను తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. రైతులకు వ్యవసాయ శాఖ సస్యరక్షణ చర్యలను వివరిస్తుందన్నారు. ఆముదం చేలలో అంతర పంటగా కంది సాగు చేసుకోవచ్చునన్నారు. పథమ ప్రదర్శన చేసేందుకు మొదట 25 మంది రైతులకు ఆముదం(ఐసిహెచ్5), కంది(పిఆర్‌జి176) విత్తనాలను అందజేశారు. మండల వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) సీతారాం నాయక్, ముంతాజ్ పాల్గొన్నారు.

సేవాలాల్ సేన్ రాష్ట్ర కో కన్వీనర్‌గా గిరినాయక్



నియామక పత్రం అందుకుంటున్న గిరినాయక్

ఊర్కొండ, జూన్ 22: మండలంలోని రాచాలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కాల్యా తండాకు చెందిన తెలంగాణ ఉద్యమ కారుడు గిరినాయక్‌ను తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ సేన్ రాష్ట్ర కో కన్వీనర్‌గా నియమించారు. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య కళా నిలయంలో తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు బుక్యా సంజీవ్ నాయక్ చేతుల మీదుగా తెలంగాణ ఉద్యమకారుడు గిరినాయక్ సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్‌గా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తామని, తమ హక్కుల సాధనలో భాగస్వామ్యం అయి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు.

గురుకులాలకు చెంచు విద్యార్థుల తరలింపు



ఆటోలో చెంచు విద్యార్థులను పాఠశాలలకు తీసుకెళుతున్న ఆర్డీటీ సిబ్బంది

మన్ననూర్, జూన్ 22: మారుమూల ప్రాంత పెంటల్లో ఉండే చెంచు విద్యార్థులు విద్యకు దూరం కారుండా ఆర్డీటీ సంస్థ చర్యలు చేపట్టింది. నల్లమల అభయారణ్య ప్రాంతంలోని రాంపూర్, మల్లాపూర్, బౌరాపూర్, ఈర్లపెంట, కొమ్మనపెంట, గీసుగండి, పిల్లిగుండ్లు, రాంపూర్, ఆగర్లపెంట తదితర పెంటల్లో గురుకులం విద్యార్థులతో కలిసి ఆర్డీటీ ఏరియా టీం లీడర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో శనివారం పర్యటించారు. తమ పిల్లలను బడులకు పంపి ప్రయోజకులు చేయాలని చెంచులకు అవగాహన కల్పించారు. ఎలాంటి బస్ సౌకర్యం లేని పెంటల నుంచి ఆర్డీటీ వారు ఆటోలను అద్దెకు తీసుకొని 43 మంది చెంచు విద్యార్థులను ఐనోలు ఆశ్రమ పాఠశాల, మన్ననూరు పీటీజీ గురుకులం, అమ్రాబాద్ మినీ గురుకులం, రాయలగండి కస్తూరిబా గాంధీ విద్యాలయాలకు చేర్చారు. ఆర్డీటీ కమ్యూనిటీ ఆర్గనైజర్ నవీన్, పీటీజీ ఉపాధ్యాయులు జైపాల్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

'బస్సు నడపకుంటే డిపోను ముట్టడిస్తాం'

వంగూరు, జూన్ 22: డిండి-ఉమ్మాపూర్ బస్సును సోమవారం వరకు పునఃప్రారంభించకుంటే కల్వకుర్తి ఆర్టీసీ డిపోను ముట్టడిస్తామని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్ హెచ్చరించారు. శనివారం వంగూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు గత రెండు నెలలుగా బస్సును రద్దు చేయడంతో సామాన్య ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సును నడపాలని డిపో అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వంత మండలమైన వంగూరుకి ఆర్టీసీ అధికారులు బస్సును నడపకపోవటం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. జూన్ 1న విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ డిండి-ఉమ్మాపూర్ బస్సును నడపక పోవటం మూలంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు స్కూల్ మానేసే పరిస్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. ఈ నెల 25న విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కల్వకుర్తి ఆర్టీసీ డిపోను ముట్టడిస్తామని హెచ్చరించారు.

'నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి'

అచ్చంపేటటౌన్, జూన్ 22: నీట్ పేపర్ లీకేజీపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వర్థం సైదులు అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నీట్ పేపర్ లీకేజీపై తక్షణమే నరేంద్రమోదీ ప్రభుత్వం స్పందించి నిందితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ అధికారంలో ఉన్నటువంటి రాష్ట్రాల్లోనే ఎందుకు పేపర్ లీకేజీలు అవుతున్నాయని, వారు వెంటనే స్పందించాలన్నారు. నీట్‌ను వెంటనే రద్దు చేసి బాధ్యులైన వారిని శిక్షించాలన్నారు. నాయకులు మధు, లడ్డుయాదవ్, నరేష్, రవి, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నీట్ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలి

కల్వకుర్తి: నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని బీఆర్ఎస్ కల్వకుర్తి నియోజకవర్గ నాయకుడు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీకేజీకి పాల్పడిన బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం నీట్ పరీక్ష నిర్వహణలో పూర్తిగా వైఫల్యం చెందిందని విమర్శించారు. ఎంతో మంది పేద విద్యార్థులు కష్టపడి చదివి నీట్ రాశారని, పేపర్ లీకేజీ వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నీట్ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని ఆయన కోరారు.

నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి

చారకొండ: నీట్ పరీక్ష లీకేజీపై సమగ్ర విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు డాక్టర్ సీహెచ్ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన చారకొండలో విలేకరులతో మాట్లాడుతూ ఎంబీబీఎస్, ఇతర విద్య, వైద్య కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన నీట్, యూజీ పరీక్షలలో అవకతవకలు జరుగుతున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించకపోవడం సమంజసం కాదని అన్నారు. నీట్ పరీక్ష లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

బ్యాగులు ప్రదానం చేసిన ఎన్ఆర్ఐ

ఉప్పునుంతల, జూన్ 22 : మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని బాలుర ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి ప్రవాస భారతీయుడు మర్యాద రుక్మారెడ్డి శనివారం విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను చదివిన పాఠశాల విద్యార్థులకు చేయూతనివ్వాలని ఉద్దేశంతో తన సోదరుడు కృష్ణారెడ్డితో బ్యాగులు పంపిణీ చేయడం జరిగిదన్నారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, నర్సింహరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, రామచంద్రారెడ్డి, శేఖర్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

మన్ననూర్, జూన్ 22: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంపీటీసీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు రహీం అన్నారు. అమ్రాబాద్ మండలంలోని మన్ననూరు గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో ఈ విద్యాసంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని వారు శనివారం ప్రారంభించారు. హెచ్ఎం సిద్ధార్థ మహాదేవ్, కాంగ్రెస్ నాయకులు సంబు వెంకట్‌రమణ, బాలస్వామి, జూలూరి సత్యనారాయణ, శివాజీ, మధు, హన్మంత్ రెడ్డి , ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

300మంది విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

తెలకపల్లి, జూన్ 22 : మండల పరిధిలోని పెద్దూరు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుధాకర్‌గౌడ్ తన తండ్రి నాగయ్యగౌడ్ జ్ఞాపకార్థం మండలంలోని పెద్దూరు, వట్టిపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే 300మంది విద్యార్థులకు భోజన ప్లేట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. పెద్దూరు గ్రామంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వట్టిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు భోజన ప్లేట్లను పంపిణీ చేశారు.

అమరగిరిలో వైద్య శిబిరం

కొల్లాపూర్, జూన్ 22 : కొల్లాపూర్ మండల పరిధిలోని అమరగిరి చెంచుగూడెంలో వైద్య శిబిరం నిర్వహించినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ ఆదేశానుసారం అమరగిరిలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరంలో అమరగిరి చెంచులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, చంటి పిల్లలకు టీకాలు, జ్వర పీడితులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. సబ్ యూనిట్ అధికారి రామ్మోహన్, ఏఎన్ఎమ్ భాగ్యమ్మ, హెల్త్ అసిస్టెంట్ దివాకర్, ఆశ కార్యకర్త పద్మ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అచ్చంపేటటౌన్, జూన్ 22: అంగన్‌వాడీ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో బాలచందర్ సృజన్ అన్నారు. అంగన్ వాడీ సెంటర్లలో ప్రీస్కూల్ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఐసీడీఎస్ పీవో దమయంతితో కలిసి మాట్లాడారు. అంగన్‌వాడీలలో ప్రీస్కూల్స్ కార్యక్రమాలు చక్కగా నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లలో టాయిలెట్లను ఉపయోగించాలని తెలియజేశారు. గ్రామాల్లో చిన్నారులు అంగన్‌వాడీ సెంటర్లకు వచ్చేలా చూడాలన్నారు. ఏసీడీపీవో కమల, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

వంగూరు, జూన్ 22: స్వయం సహాయక సంఘాలకు తోడ్పాటునందిస్తున్న వీవోఏలకు కనీస వేతనం అమలు చేసి వారికి ఉద్యోగ భద్రత కల్పించి ఆదుకోవాని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు శివరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వంగూరులో జరిగిన వీవోఏల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్టంలో అతి తక్కువ వేతనం నెలకు రూ. 5 వేలకు పని చేస్తున్నది వీవోఏలన్నారు. వెంటనే రూ.26 వేలు నెలకు జీతం ఇచ్చి ప్రభుత్వం వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రామస్వామి, రాజేందర్, జంగయ్య బాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అచ్చంపేటటౌన్, జూన్ 22: పట్టణంలో వలపట్ల కాలనీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆంజనేయులు తండ్రి సాయిలు మరణించిన విషయం తెలుసుకున్న మునిసిపల్ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్ శనివారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు శంకర్, వెంకటయ్య, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్ ధ్రువపత్రాల పరిశీలన

బిజినేపల్లి, జూన్ 22 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెంలోని ప్రభుత్వ ఎస్వీ డిగ్రీ కళాశాలలో పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలు పొందేందుకు నిర్వహించిన పాలిసెట్‌లో అర్హత సాధించి స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులకు 23వ తేదీ నుంచి 25 వరకు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహిస్తున్నట్లు శనివారం పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. విద్యారాణి తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చే విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు రెండు సెట్లు జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. అన్ని ధ్రువపత్రాలతో పాటు స్లాట్ బుకింగ్‌లో ఇచ్చిన సమయం ప్రకారం సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు.